సాక్షి అనకాపల్లి

సోమవారం । 24 । జూలై । 2023



రేపు జీవీఎంసీ కౌన్సిల్
జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. 8లో



ప్రకృతి సాగుతో దిగుబడులు
ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడితో పాటు ఆరోగ్యకరమైన పంటలను పొంద వచ్చని జిల్లా డీపీఎం లచ్చన్న తెలిపారు. 8లో



దేవరాపల్లిలో వర్షం
మండలకేంద్రం దేవరాపల్లిలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మోస్తరు వర్షం కురిసింది. 8లో

న్యూస్‌రీల్

మినీ జాబ్ మేళా రేపు



అనకాపల్లిటౌన్: రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 25న ఉదయం 10 గంటలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుస్వదీప్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో వివిధ విభాగాల్లో పోస్టులను భర్తీ చేసేందుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత పొంది 18 నుంచి 40 సంవత్సరాల్లోపు వయసున్న యువతీ, యువకులకు ఇంటర్వ్యూలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణకు దఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నాక్ సహాయ సంచాలకులు రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై, 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలవారు అర్హులని పేర్కొన్నారు. ఒక బ్యాచ్‌కు 60 మంది చొప్పున, మొత్తం 150 గంటల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. మాకవరపాలెంలో శిక్షణ ఇస్తామని, స్టేషనరీ ఉచితంగా అందిస్తామని తెలిపారు. శిక్షణ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుందని, శిక్షణ పూర్తయిన వారికి సంబంధిత రంగంలో ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 77802 75922, 93948 85164 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

30న జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న కోరిబిల్లి సోమునాయుడు

అనకాపల్లిటౌన్: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలోని కొణతాల వెంకట నారాయణమ్మ కళాప్రాంగణలో ఈనెల 30వ తేదీ సాయంత్రం జిల్లా స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను అబ్దుల్ కలాం సేవా సంఘం, జిల్లా బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోరిబిల్లి సోమునాయుడు చెప్పారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఎస్పీ కె.సుబ్బరాజు పాల్గొనున్నట్టు తెలిపారు. 100 మంది బాడీ బిల్డర్స్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ ఎం.ఎస్.ఎస్.అప్పారావు, కలాం సేవా సంఘం ప్రధాన కార్యదర్శి అమలోజు శ్రీను, ఎ.ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఊరికి ఆరోగ్య భాగ్యం

- విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో గ్రామాల్లో వైద్యసేవలు
- ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దే మెరుగైన వైద్యం
- ప్రతి పీహెచ్‌సీ పరిధిలో రోజుకొక విలేజ్ క్లినిక్‌లో చికిత్సలు
- అందుబాటులో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు



ఒంట్లో విపరీతమైన నీరసం... మంచం మీద నుంచి లేవలేని దుస్థితి.. ఒక పక్క రోగంతో నరకయాతన.. చేతిలో చిల్లిగవ్వలేని దైన్యం.. అయినా ప్రాణాలు దక్కించుకోడానికి, వ్యాధి నుంచి బయట పడేందుకు అపోసపోపో చేసి, వ్యయప్రయాసలతో ఊరికి పదుల కిలోమీటర్ల దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్తే, ఆ సమయానికి అక్కడ డాక్టర్ లేకపోతే.. ఆ రోగి పరిస్థితి ఊహించలేం. ఇప్పుడా బాధలు తప్పాయి. రాష్ట్ర ప్రభుతం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పుణ్యమా అని ఉన్న ఊళ్లోనే మెరుగైన వైద్యం అందుతోంది. ఇంటివద్దకే వచ్చి దాక్టర్లు సేవలందిస్తున్నారు. విజయవంతంగా సాగుతున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌లపై సాక్షి గ్రౌండ్ రిపోర్ట్ – సాక్షి, అనకాపల్లి



కశింకోటలోని గవరపేటకు చెందిన ఈయన పేరు సూరిశెట్టి నరసింగరావు వ్యవసాయదారుడు. రక్తపోటు(బీపీ), గ్యాస్ట్రిక్, శరీర నొప్పులు వంటి సమస్యలతో బాధపడుతూ 16 ఏళ్లగా మందులు వాడుతున్నాడు. నిత్యం డాక్టర్ సలహాతో మాత్రలు వాడుతున్నాడు. మొదట్లో పది మాత్రలతో కూడిన స్ట్రిప్ రూ.30 ఉండేదని, ఇప్పుడు రూ.130 అయిందని చెప్తున్నాడు. తాజాగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో తమ వీధిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలియడంతో శిబిరానికి వెళ్లాడు. పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఊర్లోనే వైద్యం, మందులు ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేశాడు. నరసింగరావు మాదిరిగానే ఎంతో మంది వైఎస్సార్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ వల్ల ప్రయోజనం పొందుతున్నారు.

చిన్నపాటి వ్యాధులకు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లనక్కర్లేకుండా ప్రజల చెంతకే వైద్యులు వెళ్లి సేవలందించేలా విలేజ్ క్లినిక్‌లను గత ఏడాది అక్టోబర్ నెలలో ప్రభుత్వం ప్రారంభించింది. గ్రామాల్లో ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్యసేవలందిస్తోంది. ఈ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులతో పాటు 67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్ పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విలేజ్ క్లినిక్‌లోనే పెద్ద సమస్యలతో బాధపడే రోగులకు టెలి మెడిసిన్ ద్వారా స్పెషలిస్ట్ వైద్యుల వైద్యసూచనలతో వైద్యం అందిస్తున్నారు.

424 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

గత అక్టోబర్ 21న 'ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం' ప్రారంభించారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో సోమవారం నుంచి శనివారం వరకూ ఒక్కో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్యసేవలందిస్తున్నారు. జిల్లాలో 46 పీహెచ్‌సీల పరిధిలో 424 విలేజ్ క్లినిక్‌లున్నాయి. విలేజ్ క్లినిక్‌ల పరిధిలో 983 గ్రామ సబ్ సెంటర్లలో 39 వరకూ 104 అంబులెన్స్‌లు, 46 మంది ఎంబీబీఎస్ డాక్టర్లు, 983 మంది ఏఎన్‌ఎంలు, 39 మంది స్టాఫ్ నర్సులు, 950 మంది ఆశ కార్యకర్తలు సేవలందిస్తున్నారు. ప్రజలు ప్రతి ఆరోగ్య అవసరానికీ స్థానిక పీహెచ్‌సీలకు వెళ్లకుండా గ్రామాల్లో నిర్వహించే విలేజ్ క్లినిక్‌లోనే వైద్యసేవలు పొందుతున్నారు. జిల్లాలో ఒకటి రెండు చోట్ల మినహా మిగతా అన్ని పీహెచ్‌సీ పరిధిలో శనివారం విలేజ్ క్లినిక్‌ల్లో వైద్య సేవలందించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నాతవరం మండలం గునిపూడి పీహెచ్‌సీ, చోడవరం పీహెచ్‌సీలలో మాత్రమే వైద్యసేవలు అందించలేదు. 32 పీహెచ్‌సీల పరిధిలో ఉదయం 9 గంటలకే ఆయా విలేజ్ క్లినిక్‌లలో డాక్టర్లు వైద్యసేవలు ప్రారంభించారు. మిగతా చోట్ల ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2 గంటల వరకూ ఓపీ సేవలందించారు. ఒక్కో విలేజ్ క్లినిక్‌లో సగటున 50 నుంచి 60 మంది వరకూ ఓపీ సేవలు పొందారు. వీరిలో బీపీ, మధుమేహం రోగులే ఎక్కువ. మిగతా వారిలో చిన్నపాటి కీళ్ల నొప్పులు, జ్వర పీడితులు ఉన్నారు. ఎక్కువగా కళ్ల కలకతో బాధపడుతున్న చిన్నపిల్లలను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. ఓపీలు చూసిన తర్వాత మధ్యాహ్నం 2 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు హెల్త్ చెకప్‌లు చేశారు. అనంతరం దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతూ.. మంచంపై నుంచి కదల్లేని స్థితిలో ఉన్నవారికి, నడవలేని వారికి ఇంటి వద్దే వైద్య సేవలందించారు.

జిల్లాలో ఇలా..

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా జిల్లాలో ఇప్పటి వరకూ 1.29 లక్షల మందికి అవుట్ పేషెంట్ల(ఓపీ)కు సేవలందించారు. వీరిలో 50 శాతం వరకూ బీపీ, మధుమేహం రోగులే ఉన్నారు. మిగిలిన వారిలో 30 శాతం వరకూ గర్భిణులు, 10 శాతం జ్వరం, తలనొప్పి, విరేచనాలు, ఇతర సాధారణ రుగ్మతలు, 10 శాతం దీర్ఘకాలిక రుగ్మతలతో బాధపడుతున్న బెడ్ రెస్ట్ తీసుకుంటున్న రోగులున్నారు. రోటేషన్ పద్ధతిలో పీహెచ్‌సీ పరిధిలో అన్ని క్లినిక్‌ల్లో సేవలందిస్తున్నారు.



కశింకోటలోని గవరపేటకు చెందిన ఈమె పేరు వేగి మోనిక. కొంత కాలంగా మధుమేహంతో బాధపడుతోంది. గతంలో వైద్యం కోసం వ్యయప్రయాసలకోర్చి దూరంగా ఉన్న అనకాపల్లిలో ఆస్పత్రులకు తిరగాల్సి వచ్చేది. ఎక్కువ ధర చెల్లించి మందులు కొనుగోలు చేసేవాళ్లు. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో వైద్యం అతి చేరువ అయింది. ఇంటి పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద నెలకు రెండు దఫాలు పీహెచ్‌సీ వైద్యులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. రక్త పరీక్షలు చేస్తున్నారు. ఉచితంగా మందులిస్తున్నారు. దీంతో అక్కడే రెండు నెలలుగా వైద్య సేవలు పొందుతున్నారు. ఇంటి వద్దే వైద్యం అందిస్తున్న సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మాడుగుల మండలం కేజే పురంలో రోగులకు వైద్యపరీక్ష చేస్తున్న వైద్యులు

వైజాగ్ వెళ్లేదానిని..



నాకు బీపీ, సుగర్ ఉంది. చికిత్స కోసం వైజాగ్ వెళ్లేదాన్ని. మా గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో వైద్యసేవలందిస్తుండడంతో ప్రయాణం బాధ తప్పింది. నాకు ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలతో పాటు మందులు కూడా ఇచ్చారు. నీరసంగా ఉందంటే జ్వర పరీక్షలు కూడా చేశారు. ప్రైవేట్ ఆస్పత్రి కంటే మెరుగైన వైద్యం ఇంటి దగ్గరే అందడం ఆనందంగా ఉంది.–బి.అప్పలనర్సమ్మ, వేమగిరి, ఎస్.రాయవరం



కె.కోటపాడు మండలం డి.అగ్రహారంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సాయి కిరణ్

సద్వినియోగం చేసుకోవాలి..



ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇంటికే వచ్చి వైద్యులు వైద్యం అందించడమనేది గొప్ప కార్యక్రమం. ఒక ఎంబీబీఎస్ డాక్టర్, ఒక ఏఎన్‌ఎం, ఒక స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఆశ, ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారు. అవసరమైతే స్పెషలిస్టు డాక్టర్ల సూచనలు కూడా టెలీ మెడిసిన్ ద్వారా తీసుకుంటారు. దీన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలి. క్యాన్సర్, టీబీ, గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించడం ద్వారా ప్రాణాపాయం తప్పుతుంది. పూర్తి స్థాయిలో నయం చేసుకోవచ్చు. –డాక్టర్ హేమంత్, డీఎంహెచ్‌వో, అనకాపల్లి జిల్లా

నెలకు సరిపడా మందులు



నాకు బీపీ, మధుమేహం ఉంది. గతంలో పీహెచ్‌సీకి వెళ్లి నెల రోజులకు మందులు తెచ్చుకునేవాడిని. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో మా గ్రామంలోనే వైద్యసేవలందిస్తున్నారు. శనివారం మా గ్రామంలో నాకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు ఇచ్చారు. ఆహార నియమాలు కూడా చెప్పారు. – బోర దేముళ్లు, గుల్లెపల్లి గ్రామం



సబ్బవరం మండలం చిన్నయాతపాలెం గ్రామ విలేజ్ క్లినిక్‌లో వైద్యసేవలందిస్తున్న వైద్యులు

చేపలవేటకు వెళుతూ గుండెపోటుతో మత్స్యకారుడు మృతి

సముద్రంలో 10 కిలో మీటర్ల దూరం వెళ్లే సరికి అస్వస్థత



సోమేష్ మృతదేహం

ఎస్.రాయవరం: మండలంలోని బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన ఓ మత్స్యకారుడు సముద్రంలో తెప్పపై చేపల వేటకు వెళుతుండగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన మైలపల్లి సోమేష్(48) మరో నలుగురు మత్స్యకారులతో కలిసి ఆదివారం తెల్లవారుజామున మైలపల్లి నాగరాజు అనే మత్స్యకారుడి తెప్పపై చేపల వేటకు వెళ్లాడు. తీరానికి 10 కిలోమీటర్ల దూరంలో సోమేష్‌కు గుండెపోటురావడంతో తెప్పలో కుప్పకూలిపోయాడు.గమనించిన తోటి మత్స్యకారులు హుటాహుటిన ఒడ్డుకు తీసుకువచ్చి, నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సోమేష్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. సోమేష్ మృతితో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. తెప్ప యజమానికి,మృతుడి సోదరుడైన మైలపల్లి నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపారు.

బీసీ, ఈబీసీ సంచార జాతుల విద్యార్థులకు స్కాలర్‌షిప్

తుమ్మపాల: జిల్లాలో బీసీ, ఈబీసీ సంచార జాతుల విద్యార్థులకు పీఎం యశస్వి (పీఎం యంగ్ అచీవ్‌మెంట్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రంట్ ఇండియా) ఉపకార వేతనాలు అందిస్తున్నట్టు జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి కె.రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఏడాదికి రూ.2.50 లక్షల లోపు ఉండి, 9వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వైఈటీ.ఎన్‌టీఏ.ఏసీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉపకార వేతనాలు పొందేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబర్ 29న జరిగే ప్రవేశ పరీక్షలో విద్యార్థుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారన్నారు. ఈ పథకంలో ఎంపికైన 9వ తరగతి విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు రూ.1.25 లక్షల వరకు కళాశాల, హాస్టల్ ఫీజులకు విడుదల చేస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ఫోన్ నంబర్, ఆధార్ కార్డు బ్యాంక్ పాసుపుస్తకానికి లింకై ఉండాలని పేర్కొన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. స్కీమ్ పూర్తి వివరాలకు సోషల్ జస్టిస్.గవ్.ఇన్/స్కీమ్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

నాతవరం ఎస్‌ఐ అటాచ్

- ముగ్గురు కానిస్టేబుళ్లు, హోంగార్డ్ కూడా వీఆర్‌కు అటాచ్
- విధుల్లో దురుసుగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు
- నాతవరం ఎస్‌ఐగా గొలుగొండ ఎస్‌ఐ నారాయణరావుకు బాధ్యతలు
- అసభ్యంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు
- నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా



మాట్లాడుతున్న ఏఎస్పీ అదిరాజ్ సింగ్

నాతవరం: మండల కేంద్రం నాతవరానికి చెందిన ఆటో డ్రైవర్‌పై దురుసుగా ప్రవర్తించిన ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు, హోంగార్డును వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలు జారీ చేశారని ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు ఆయన మీడియాకు తెలిపారు. ఈ నెల 22న నాతవరం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ భార్యను వేధిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కొలగాని గంగరాజు (నాని) అనే ఆటో డ్రైవర్‌ను రప్పించారు. అయితే అతనిపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు కొట్టారని గంగరాజు బంధువులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో తమ సిబ్బందిపై చర్యలు తీసుకున్నట్టు ఏఎస్పీ చెప్పారు. గిరిజన కానిస్టేబుల్ భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించిన గంగరాజు(నాని)పై కూడా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట నర్సీపట్నం రూరల్ సీఐ ఎ.రమణయ్య ఉన్నారు.

జరిగింది ఇదీ..

నాతవరం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ భార్యతో నిందితుడు కొలగాని గంగరాజు (నాని) అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. దీంతో నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు శనివారం విచారణ నిమిత్తం పిలిపించారు. విచారణ చేస్తుండగా నిందితుడి ప్రవర్తన బాగోలేదని పోలీసులు చేయి చేసుకున్నారని ఆరోపిస్తూ గంగరాజు బంధువులు, స్థానిక టీడీపీ నాయకులు స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ చేసి, ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణతో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డుపై చర్యలు తీసుకుని వీఆర్‌కు పంపించినట్టు ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. నాతవరం ఇన్‌చార్జి ఎస్‌ఐగా గొలుగొండ ఎస్‌ఐ ఎం.నారాయణరావుకు అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు. జరిగిన సంఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నివేదిక ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు పొందిన ఎంపీసీ విభాగం విద్యార్థులకు సోమవారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభంకానున్నట్టు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, ప్రభుత్వ కెమికల్‌ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్‌లో పాల్గొవాలన్నారు.

ఇదీ షెడ్యూలు

- రిజిస్ట్రేషన్/ప్రాసెసింగ్ ఫీజులు చెల్లింపు గడువు: ఈ నెల 24 నుంచి ఆగస్టు 3వ తేదీ.
- సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో నిర్వహిస్తారు.
- వెబ్ ఆప్షన్ల నమోదు: ఆగస్టు 3 నుంచి 8
- వెబ్ ఆప్షన్ల మార్పిడి: ఆగస్టు 9వ తేదీ.
- సీట్ల కేటాయింపు: ఆగస్టు 12
- సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా రిపోర్టింగ్ ఎట్ కాలేజీస్: ఆగస్టు 13, 14 తేదీలు.

రిజిస్ట్రేషన్ ఇలా..

https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్ నంబరు, పుట్టిన తేదీ ఎంటర్ చేస్తే రిజిస్ట్రేషన్ ఫారం ఓపెన్ అవుతుంది. వివరాలు నింపి డిక్లరేషన్ సబ్‌మిట్ చేస్తే రిజిస్ట్రేషన్ ఫీజు పేమెంట్ విండోవస్తుంది.ఎస్సీ/ఎస్టీలకు రూ.600లు, ఇతరులకు రూ.1200లు ఫీజు చెల్లించి, సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి

అవసరమైన సర్టిఫికెట్లు

ఏపీఈఏపీసెట్ ర్యాంక్‌కార్డు, ఏపీఈఏపీసెట్ హాల్‌టికెట్,ఇంటర్ మార్కుల మెమో, పుట్టినతేదీ ధ్రువపత్రం(టెన్త్ మార్కుల లిస్ట్),టీసీ, 6 నుంచి ఇంటర్ స్టడీ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్‌సర్టిఫికెట్ ఫర్‌ఓసీ, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు, మైగ్రేటెడ్ విద్యార్థులకు లోకల్ స్టేటస్ సర్టిఫికెట్.

ప్రత్యేక కేటగిరి కౌన్సెలింగ్

- ఈనెల 30న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ 1-50000
- ఈనెల 31న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్‌గేమ్స్ 50001-90000, క్యాప్స్ 1-40000
- ఆగస్టు 1న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 90001-140000,క్యాప్స్ 40001-900000
- ఆగస్టు 2న ఎన్‌సీసీ/స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 140001-చివరిర్యాంకు, క్యాప్స్ 90001-చివరి ర్యాంకు
- ఆగస్టు 3న పీహెచ్‌వీ/పీహెచ్‌హెచ్/పీహెచ్‌వో/ఆంగ్లో ఇండియన్/స్కాట్స్ అండ్ గైడ్స్ 1 నుంచి చివరి ర్యాంకు వరకు
- వీరంతా షెడ్యూల్ ప్రకారం విజయవాడ పాలిటెక్నిక్ కాలేజీలో హాజరు కావాలి.

క్లుప్తంగా

దేవరాపల్లిలో వర్షం

దేవరాపల్లి: మండలకేంద్రం దేవరాపల్లిలో ఆదివారం మధ్యాహ్నం నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం వరి నారుమడులకు, దమ్ములు చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు. రైవాడ జలాశయం గరిష్ట నీటి మట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 108.85 మీటర్లకు చేరుకుంది. జలాశయంలోకి 265 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని జలాశయం పర్యవేక్షణ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

ప్రకృతి సాగుతో అధిక దిగుబడులు

బుచ్చెయ్యపేట: ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడితో పాటు సంపూర్ణ ఆరోగ్యకరమైన పంటలను పొందవచ్చని ఆ శాఖ జిల్లా డీపీఎం లచ్చన్న తెలిపారు. ఆదివారం బంగారు మెట్టలో పంటలను పరిశీలించి, రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలు,ప్రకృతి సాగు వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. మీనామృతం తయారీ, వినియోగం, కలిగే ప్రయోజనాలను వివరించారు. లోపూడిలో ప్రకృతి వ్యవసాయ పరికరాల ఎన్‌పీఎం షాపును ఆయన ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ ఆర్‌టీవోలు హేమసుందర్,గోవింద,ఎస్ఎస్ఎ నాగమణి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మునగపాక: తిమ్మరాజుపేటలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.11,600 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు. గ్రామంలో పేకాడుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అలీ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

రేపు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం


జీవీఎంసీ కౌన్సిల్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 25న జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరగనుంది. కౌన్సిల్ సమావేశంలో 44 అంశాలు పొందుపరిచారు. మరో 41 సప్లిమెంటరీ అంశాలు ఆ రోజున కౌన్సిల్‌కు చర్చకు రానున్నాయి. సప్లిమెంటరీ అంశాలను పరిశీలిస్తే.. కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లో 24.20 ఎకరాల్లో రూ.43.80 కోట్లతో ఘన వ్యర్థాలను బయో మైనింగ్ చేసేందుకు పరిపాలన ఆమోదం, పరిపాలన విభాగంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను 2023–2024 ఆర్థిక సంవత్సరానికి కొనసాగించడం, ఆప్కోస్ ద్వారా వారి వేతనం చెల్లించేందుకు అంచనా వ్యయం రూ.3,86,50,000కు పరిపాలన ఆమోదం, రూ.1.98 కోట్లతో సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి అడవివరం జంక్షన్ వరకు రోడ్డుకి పడమర వైపున వరద నీటి కాలువ నిర్మాణం, రూ.9.92కోట్లతో కుమ్మరవీధి నుంచి అడవివరం జంక్షన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూ.1.96కోట్లతో సింహాచలం ఆర్టీసీ డిపో నుంచి అడవివరం జంక్షన్ వరకు తూర్పు వైపున వరద నీటి కాలువ నిర్మాణం, రూ.11.35కోట్లతో పాత గోశాల జంక్షన్ నుంచి తొలి పావంచా వరకు బీటీ రోడ్డు నిర్మాణం, రూ.7.36 కోట్లతో తొలి పావంచా నుంచి కుమ్మరవీధి వరకు బీటీ రోడ్డు నిర్మాణం విషయమై పరిపాలన అనుమతికై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడంపై కౌన్సిల్‌లో చర్చ జరగనుంది. అలాగే రూ.1.68కోట్లతో అనకాపల్లి జోన్ 80 నుంచి 84వ వార్డులోని సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు ఫుట్‌పాత్, సెంట్రల్ మీడియన్ నిర్మాణం, మరమ్మతులు, రూ.1.93 కోట్లతో అనకాపల్లి జోన్ సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారద బ్రిడ్జి వరకు బీటీ రోడ్డు విస్తరణ, రూ.98 లక్షలతో అనకాపల్లి జోన్ 83వ వార్డులో పెరుగు బజార్ జంక్షన్ అభివృద్ధి, రూ1.4కోట్లతో పెరుగు బజార్ జంక్షన్‌లో ఆర్‌సీసీ డ్రైన్ నిర్మాణం, రూ.1.19 కోట్లతో అనకాపల్లి జోన్ 80వ వార్డులో జాతీయ రహదారి 16 నుంచి రాజుపాలెం గ్రామం వరకు బీటీ రోడ్డు విస్తరణ, రూ.1.41కోట్లతో 82వ వార్డు నెహ్రూ చౌక్ జంక్షన్ నుంచి గుండాల జంక్షన్ వరకు బీటీ రోడ్డు విస్తరణ, రీలేయింగ్, ఫుట్‌పాత్ నిర్మాణం, రూ.89.75లక్షలతో 41వ వార్డు ఎర్రిగెడ్డ వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి ఆర్ అండ్ డీ యార్డ్ వరకు వరద నీటి కాలువ ఆపరేషన్, నిర్వహణ, పాతనగరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ క్వీన్ విక్టోరియా విగ్రహం జంక్షన్ వరకు 60 అడుగుల ప్రతిపాదిత రోడ్డు విస్తరణ, ఇరువైపులా వరద నీటి కాలువలు, కాలిబాటలు, సెంట్రల్ మీడియన్ ఏర్పాటు, తదితర అభివృద్ధి పనులకు సంబంధించి పరిపాలన ఆమోదానికి కౌన్సిల్ చర్చించనుంది.

పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం

అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులకు మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్ అభినందన


కశింకోట మండలాధ్యక్షుడు మలసాల కిశోర్‌ను అభినందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


మంత్రి అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న అనకాపల్లి మండలాధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద

తుమ్మపాల: పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తించి సముచిత స్థానం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లిలో ఈ నెల 22న పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, కశింకోట మండలాల అధ్యక్షులుగా మలసాల కిశోర్, పెద్దిశెట్టి గోవిందలను నియమించారు. ఈ మేరకు రెండు మండలాల అధ్యక్షులు గాజువాక దరి మిందిలో మంత్రిని ఆదివారం వారు మర్యాద పూర్వకంగా కలిశారు. తమను గుర్తించి పార్టీలో పదవులు వచ్చేలా కృషి చేసినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహించి రానున్న ఎన్నికల్లో పార్టీని విజయ పథాన నడిపించేందుకు కృషి చేయాలని మంత్రి వారికి సూచించారు. మండల, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్నారు. కశింకోట మండలాధ్యక్షుడు కిశోర్ మాట్లాడుతూ తన పదవికి న్యాయం చేస్తానని, పార్టీ కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, కలగ లక్ష్మిగున్నయ్యనాయుడు, ఎంపీటీసీలు లగిశెట్టి గణేష్, అద్దంకి సతీష్, ఇందలి మూసలినాయుడు, బంటు ఏడుకొండలు, మంత్రి సత్తిబాబు, పసుపులేటి రామకృష్ణ, బొండా అప్పలరాజు, ఆడారి సూరిఅప్పారావు, భూలోకనాయుడు, హనుమంత వెంకట్, తోట గణేష్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ


నెహ్రూచౌక్ వద్ద మానవహారంగా ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

తుమ్మపాల: మణిపూర్‌లో హింసాత్మక ఘటనలపై ప్రభుత్వాలు, ప్రజా సంఘాలు, మానవతావాదులు తక్షణమే స్పందించి శాంతిని నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు కోరారు. కశింకోట, మునగపాక, అచ్యుతాపురం, చోడవరం, పరవాడ, కె.కోటపాడు, రాంబిల్లి మండలాల క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో నెహ్రూ చౌక్ వద్ద ఆదివారం పలువురు క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ సీహెచ్.ప్రకాష్ మాట్లాడుతూ 90 రోజులుగా మణిపూర్‌లో అశాంతి నెలకొందన్నారు. ఓ వర్గంపై మరో వర్గం దాడులు చేయడం అమానుషమన్నారు. గౌరవాధ్యక్షుడు రెవరెండ్ క్రాంతిపాల్ మాట్లాడుతూ అల్లరి మూకల దాడులపై ప్రభుత్వాలు స్పందించి శాంతిని నెలకొల్పాలన్నారు. అంతకుముందు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టి హింసాత్మక ఘటనల్లో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. ఫెలోషిప్ జిల్లా ప్రతినిధులు డాక్టర్ వినోద్ అబ్రహం, చైర్మన్ బి.యోహోను, కె.పి.డి.ఆర్ ప్రసాద్, కె.సన్నిజెమ్స్, ఎ.శ్యాంబాబు, బి.ఏసురత్నం పాల్గొన్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు రాష్ట్ర జట్టు ఎంపిక


విజేతలతో పాఠశాల ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

పరవాడ: పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీల కోసం రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక పోటీలు ఆదివారం జరిగాయి. హిమ ప్రభాస్, అభినవ్, సోహన్ గౌతమ్, అతిక్ష, ప్రేరణ, మైత్రి, విద్యశ్రీ, పురందరి, కార్తీక్, వైభవ్, పూణీత్ వీర్, చేతన్ శివాశిష్, లలిత్ రాంచరణ్, బోనీ అశ్వద్, లాస్య, అభినయ్, శౌరీ, జైదీప్, మణికంఠ, రణదీర్, తేజ, ధార్మిక్, శ్రేయాస్, ధరహస్, సాయికైలేష్, పి.కీర్తి, సంజన, శ్రీమయ్, శ్యామ్ గణేష్, అజిత్, సనూతి తదితరులు రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అండర్ వాటర్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పాఠశాల సీఈవో నిశాంత్, ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, యూఎస్ఎఫ్ఏ రాష్ట్ర కార్యదర్శి పి.బాలాజీ, డీఎఫ్‌వో మంగమ్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు బంగారు, వెండి, కాంస్య పతకాలు అందించారు. కోచ్‌లు హరినాథ్‌రెడ్డి, మనీష్, బషీర్, రాజేష్, లోహిత్, గోవింద్, కృష్ణవేణి పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం


నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సీఎంఆర్ అధినేతకు చూపుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణంలో నూకాంబిక ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అభ్యర్థన మేరకు సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.10లక్షల విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యే గణేష్ విజ్ఞప్తి మేరకు సీఎంఆర్ అధినేత వెంకటరమణ నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే, సీఎంఆర్ అధినేతకు ఆలయ చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ఎమ్మెల్యే, సీఎంఆర్ అధినేత ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని పరిశీలించిన సీఎంఆర్ అధినేత తనవంతు సాయంగా రూ.10 లక్షలు విరాళంగా ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 లక్షలతో ఆలయం నిర్మించామన్నారు. ఆలయం నిర్మాణ పనులు పూర్తియ్యేందుకు నిధులు కావాల్సి ఉందన్నారు. తన విజ్ఞప్తి మేరకు సీఎంఆర్ అధినేత అమ్మవారి ఆలయానికి రూ.10 లక్షలు ప్రకటించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, మహిళా విభాగం అధ్యక్షురాలు గణమ్మ, లలిత, కమిటీ సభ్యులు కణితి అన్నపూర్ణ పాల్గొన్నారు.

పార్టీలో ఉన్నవాళ్లకే మళ్లీ కండువాలా..?

టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపై విమర్శలు


సభలో అయ్యన్న పక్కన కండువాలతో ఉన్న జైబాబు, తదితరులు


టీడీపీ కండువాతో జైబాబు(ఫైల్)

మాకవరపాలెం: పార్టీలో ఉన్న వాళ్లకే మళ్లీ కండువాలు కప్పడం హాస్యాస్పదంగా ఉందని జి.కోడూరు వైఎస్సార్‌సీపీ నేత బొడ్డేటి వెంకటరమణ విమర్శించారు. మండలంలోని జి.కోడూరులో ఆదివారం రాత్రి టీడీపీ భవిష్యత్తుకు గ్యారంటీ సభ నిర్వహించారు. ఈ సభలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. గ్రామంలో ఉన్నత పాఠశాలను అయ్యన్న మంజూరు చేయించినట్టు చెబుతున్నారని, కానీ దివంగత ఎమ్మెల్యే రాజాసాగి కృష్ణమూర్తిరాజు హయాంలో మంజూరైందన్నారు. ఇక తనను పాతేస్తానని చెబుతున్న అయ్యన్నకు పదవి లేకుండా ప్రజలెప్పుడో పాతేశారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. పాతేస్తారని భయపడే.. ఇతర గ్రామాల నుంచి జనాన్ని రప్పించుకున్నారని ఎద్దేవా చేశారు. మళ్ల జగన్నాథరావు(జైబాబు) టీడీపీలో ఉండగా, మళ్లీ పార్టీ కండువా వేసి ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో వచ్చారని చెబుతున్నారని, తను టీడీపీలో చేరి చాలా కాలమే అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల జగన్నాధరావు, వెలగా రమణ, తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 27 నుంచి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు


డాక్టర్ రవిరాజ్‌కు చెక్కు అందజేస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణ, ఆర్. శశిప్రభ

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలను అక్టోబర్‌లో మూడు రోజుల పాటు నిర్వహించాలని పూర్వ వైద్య విద్యార్థులు నిర్ణయించారు. అక్టోబర్ 27 ,28,29 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు ప్రధాన మంత్రి మోదీ, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిలను ఆహ్వానించాలని నిర్ణయించారు. సీఎంఈ, ఇతర వైద్యులు, పలు శాఖల ఉన్నతాధికారులను ఆహ్వానించనున్నట్టు పూర్వ విద్యార్థుల సంఘం కేంద్ర కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఆవరణలో వైద్యులతో నిర్వహించిన సమావేశంలో రవిరాజ్ మాట్లాడారు. ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, పూర్వపు ప్రిన్సిపాల్స్ ఆర్.శశిప్రభ, డాక్టర్ పి.వి.సుధాకర్, టి.రాధ, సీనియర్ వైద్యులు ఎ.కృష్ణవేణి, కె.వి.రామ్మూర్తి కమిటీలో ఉంటారన్నారు.

మోదమ్మ దర్శనానికి భారీగా భక్తులు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి దర్శనానికి భక్తులు ఆదివారం భారీగా తరలివచ్చారు. మైదాన ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. ఆలయ కమిటీ భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేసింది. అలాగే ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడి వద్ద కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.మొక్కులు తీర్చుకుని కాఫీతోటల ప్రాంతాల్లో కుటుంబ సమేతంగా వంటలు చేసుకున్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

సాక్షి,పాడేరు: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడు నెలల చిన్నారి మృతి చెందింది. ఆమె తల్లికి తీవ్ర గాయమైంది. ఆదివారం సాయంత్రం 6గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన కిల్లో పుష్పవతి, కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో పాడేరు నుంచి స్వగ్రామం బయలు దేరారు. పాలిటెక్నిక్ కళాశాల వద్దకు వచ్చేసరికి ఆటోను ఎదురుగా వస్తున్న పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో చిన్నారి కిల్లో అన్విత తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆమె తల్లి పుష్పవతి కాలు విరిగిపోవడంతో తీవ్రంగా గాయపడింది. పాడేరు ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

జిల్లా హెచ్‌ఎంల సంఘం అధ్యక్షునిగా శాస్త్రి


కశింకోటలో ఎన్నికైన జిల్లా హెచ్‌ఎంల అసోసియేషన్ నూతన కార్యవర్గానికి అభినందన

కశింకోట: జిల్లా ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షునిగా ఏవీహెచ్ శాస్త్రి ఎన్నికయ్యారు. అసోసియేషన్ సమావేశాన్ని స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.జె.రవీంద్రబాబు, కోశాధికారిగా జి.వి.ఎస్.నాగేంద్ర, రాష్ట్ర కౌన్సిలర్లుగా ఏవీఎస్ఎస్ మూర్తి, వీవీ శేషగిరి రావు, వి.నూకరాజు, గౌరవాధ్యక్షునిగా బీవీఎస్ సాయిబాబా ఎన్నికయ్యారు. డివిజన్ కార్యదర్శులుగా బీఎస్ఎన్‌మూర్తి, ఎంఎస్ ప్రసాద్, మీడియా కన్వీనర్‌గా ఎంఆర్‌వీ అప్పారావు నియమితులయ్యారు. ఎన్నికల అధికార్లుగా కె.రామ్‌జీ, కె.శ్రీరామమూర్తి వ్యవహరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని హెచ్‌ఎంలు అభినందించారు.

కారు బైక్ ఢీ ... బయటపడ్డ గంజాయి

అనంతగిరి: మండల కేంద్రం సమీపంలోని మలుపు వద్ద ఆదివారం ఉదయం కారు బైక్ ఢీకొనగా, కారు ముందు భాగం నుంచి గంజాయి బయటపడింది.. స్థానికులు అందించిన వివరాలివి. అరకులోయ వైపు నుంచి మైదాన ప్రాంతానికి వెళుతున్న కారు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగంలో ఉన్న గంజాయి బయట బయపడింది. పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయికు సంబంధించి పోలీసులు వివరాలను వెల్లడించాల్సి ఉంది.

పాత కక్షలతో కత్తితో దాడి...కేసు నమోదు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. కూలి పని చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న తాళ్లపాలెంలోని దుర్గాలమ్మపేట వీధికి చెందిన కర్రి శ్రీనును పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని తన ఇంటి పక్కనున్న వరుసకు తమ్ముడైన కర్రి రమణ బాబు అలియాస్ లింగాలు తరచుగా దూషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం కూలి పని చేసుకొని ఇంటికి వస్తుండగా దుర్భాషలాడి శ్రీనును కొట్టి చంపుతానని లింగాలు బెదిరించాడు. ఇంతలో శ్రీను కుమారుడు పవన్ కుమార్ వచ్చి తండ్రిని లింగాలు బారి నుంచి విడిపించాడు. అనంతరం అదే గ్రామంలో రామాలయం వద్ద కొంతమందితో కలిసి శ్రీను కూర్చొని ఉండగా, లింగాలు అక్కడకు వచ్చి కత్తితో శ్రీనుపై దాడి చేసి మెడపై నరకడానికి ప్రయత్నించాడు. శ్రీను తప్పించుకోవడంతో చెంపపై కత్తి తగిలి బలమైన గాయం అయింది. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

డిప్లొమా విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని దీపిక

యలమంచిలి: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన విద్యార్థిని శీలం దీపిక(18) ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాలతో క్షణికావేశంలో ఆమె నివాస గృహంలో గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కొన ఊపిరితో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు ద్విచక్రవాహనంపై ప్రభుత్వాస్పత్రికి అత్యవసర చికిత్స నిమిత్తం తీసుకొస్తుండగా మార్గంలో ఉన్న పెదపల్లి రైల్వేగేటు మూతపడి ఉండడంతో ఎర్రవరం మీదుగా స్థానిక సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. డ్యూటీలో ఉన్న వైద్యుడు, సిబ్బంది ఆమెను బతికించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది.మృత ,దేహాన్ని యలమంచిలి మార్చురీకి తరలించారు. డిప్లొమా చదువుతున్న దీపిక ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఎస్ రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన విద్యార్థిని కుటుంబం పట్టణంలోని రాంనగర్‌కు వలస వచ్చింది. వీరు స్థానికంగా ఒక అద్దె ఇంట్లో చిన్న టిఫిన్ కొట్టు నడుపుకొంటున్నారు.

గిరిజనుల జీవన సౌందర్యం అమోఘం

- ఉపముఖ్యమంత్రి రాజన్నదొర
- ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి గిరిజన ఉత్సవాలు


గిరిజన చిత్రాలను వీక్షిస్తున్న యువతులు



కళాకారులతో నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి

బీచ్‌రోడ్డు: గిరిజనుల జీవన సౌందర్యం అమోఘమని ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గిరిజనోత్సవం ముగింపు వేడుకలను ఆదివారం వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించారు. గిరిజన సాంస్కృతి సంప్రదాయలు కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తున్నాయని రాజన్నదొర పేర్కొన్నారు. ఈ ఏడాది జరగబోయే ఆదివాసీ దినోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తొలిసారిగా రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రపంచానికి జీవన శైలి, వారి పండగలు, ఆహార అలవాట్లను తెలుసుకునేందుకు ఇటువంటి ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీసీఆర్ టీఎం మిషన్ డైరెక్టర్ రవీంద్రబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులతో నృత్యం చేసిన రాజన్న

గిరిజన ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని వివిధ గిరిజన ప్రాంతాలకు చెందిన కళాకారులతో డిప్యూటీ సీఎం రాజన్న దొర, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే కళావతి నృత్యం చేసి అలరించారు.

క్లుప్తంగా

శిష్టకరణ సమితి నూతన కార్యవర్గం ఎన్నిక



శిష్టకరణ సమితి నూతన అధ్యక్షుడు బెనర్జీని సత్కరిస్తున్న సమితి సభ్యులు

తుమ్మపాల: శిష్టకరణ సమితి జిల్లా అధ్యక్షుడిగా బీఎస్ బెనర్జీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభాధ్యక్షుడు ఎస్వీఎన్ పట్నాయక్ తెలిపారు. పట్టణంలోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్‌లో ఆదివారం జరిగిన శిష్టకరణ సమితి 53వ వార్షిక సర్వసభ్య సమావేశంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర టీడీపీ సాకార సమితి కన్వీనర్ అంకు మహంతిరాజా, బద్రీమహంతి వెంకటరావు, శేఖరమంత్రి శ్రీనివాసరావులు హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా జక్కువ వెంకట గోపినాథరావు, పాలకీ సునీత, ప్రధాన కార్యదర్శిగా జగ్గుమంత్రి రమాదేవి, సహాయ కార్యదర్శిగా సదాశివుని మన్మధరావు, ఆడిటర్‌గా ఉమామహేశ్వరరావులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా కిషోర్



నియామక పత్రాన్ని కిషోర్‌కు అందిస్తున్న విశాఖ పార్లమెంటరీ అధ్యక్షుడు రవీంద్ర

అనకాపల్లిటౌన్: బీజేపీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా గేదెల వెంకట అప్పల కిషోర్‌ను నియమిస్తూ పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు రవీంద్ర విశాఖ పార్టీ కార్యాలయంలో ఆదివారం నియమకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 28 సంవత్సరాలుగా కిషోర్ న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్నారని, బడుగు, బలహీన వర్గాల ప్రజల కేసులను వాదించడంలో తనదైన నైపుణ్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

మాజీ కౌన్సిలర్ గంగయమ్మ మృతి



గంగయమ్మ(ఫైల్)

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం నిదానందొడ్డిలో నివసిస్తున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బుద్ద గంగయమ్మ(86) అనారోగ్యంతో ఆదివారం తన స్వగృహంలో మరణించారు. ఆమె అనకాపల్లి మున్సిపాల్టీలో 2000–05 వరకు 13వ వార్డు కౌన్సిలర్‌గా పని చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు గంగయమ్మ స్వగృహం నుంచి అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈమె భర్త ఐదేళ్ల క్రితం మృతిచెందారు. ఈమెకు ఒక కుమారుడు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
హిడింబ	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
కార్తీక	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
సామజవరగమన	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–9 యూనిట్లు, ఏ నెగిటివ్–3 యూనిట్లు, బీ పాజిటివ్–35 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–22 యూనిట్లు, ఓ నెగిటివ్–2 యూనిట్లు, ఏబీ పాజిటివ్–8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 236 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు

- పల్లె ముంగిటకు 'ఫ్యామిలీ డాక్టర్'
- విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యం

గ్రామీణ ప్రజలకు సైతం మెరుగైన వైద్యం అందించాలన్నదే సీఎం జగన్ ప్రధాన ధ్యేయం. అందులో భాగంగానే ఆరోగ్యశ్రీని అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లారు. దాంతోపాటు విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానాలను ప్రవేశపెట్టారు. ప్రజల ఆరోగ్యానికి తమ ప్రభుత్వం ఏ స్థాయిలో ప్రాధాన్యతిస్తుందో తేటతెల్లం చేశారు. ఎంబీబీఎస్ వైద్యుని సేవలు, పదుల సంఖ్యలో రక్త పరీక్షలు, వంద రకాలకు పైగా ఉచిత మందులు చెంతకే వచ్చి అందిస్తూ పేదలపై ఆరోగ్య భారాన్ని తప్పించారు.



అనకాపల్లి మండలం మామిడిపాలెం హెల్త్ క్లినిక్‌లో రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు పావని

అనకాపల్లి టౌన్/కశింకోట: వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం చేరువ అయింది. చిన్న పాటి ఆరోగ్య సమస్యకు కూడా దూరంగా ఉన్న ఆస్పత్రుల చుట్టూ వ్యయ ప్రయాసలకోర్చి తిరగాల్సిన అగత్యం లేకుండా ఈ క్లినిక్‌లు విశేష సేవలందిస్తున్నాయి. ప్రజల మన్ననలు పొందుతున్నాయి. నియోజకవర్గం పరిధి అనకాపల్లి మండలంలో తుమ్మపాల, తగరంపూడి, కశింకోట మండలంలో కశింకోట, తాళ్లపాలెంలో పీహెచ్‌సీలున్నాయి. వీటి పరిధిలో 41 హెల్త్ క్లినిక్‌లు నడుస్తున్నాయి.

క్రమం తప్పకుండా వైద్య సేవలు

సుమారు రెండేళ్ల క్రితం గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే సత్సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టారు. యుద్ధ ప్రాతిపదికన ఈ క్లినిక్‌లలో వైద్యాధికారులను, సిబ్బందిని నియమించారు. ఈ క్లినిక్‌లు ప్రధానంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులిస్తూ సేవలందిస్తున్నాయి. తరచుగా అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లకు వెళ్లి పిల్లల్లో రక్తహీనత నివారణకు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రక్త హీనత, ఎదుగుదల తక్కువగా ఉన్న వారికి మందులను ఉచితంగా అందిస్తూ వారి శారీరక వికాసానికి దోహదపడుతున్నారు. అలాగే పిల్లలకు కళ్ల సమస్య గురించి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తున్నారు. దీర్ఘకాలిక రోగాలైన సుగర్, బీపీల నివారణకు, సీజనల్ వ్యాధులకు తనిఖీలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఉంటే సమీపంలోని పీహెచ్‌సీ, అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రులకు సిఫార్స్ చేస్తున్నారు.

నెలకు రెండు రోజులు వైద్యశిబిరాలు

నెలకు రెండు రోజులు క్లినిక్ పరిధిలో పీహెచ్‌సీ వైద్యాధికారులతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ సేవలందిస్తున్నారు. దీంతో క్లినిక్‌లతోపాటు ఉచిత వైద్య శిబిరాలకు విశేష ఆదరణ లభిస్తోంది. క్లినిక్‌లకు రోజుకు 30 నుంచి 40 మంది వరకు రోగులు సేవలు పొందుతుండగా, క్లినిక్‌ల పరిధిలో నెలకు రెండు దఫాలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్లో వంద మంది పైబడి సేవలు పొందుతున్నారు. ఇలా ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య సేవలు చేరువ చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

శనివారం వైద్య సేవల వివరాలు

- అనకాపల్లి మండలంలోని తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో సుందరయ్యపేట విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శనివారం పీహెచ్‌సీ డాక్టర్ పావని వైద్యసేవలందించారు. 61 ఓపీలు చూశారు. ఇందులో 32 వరకూ బీపీ రోగులు, 10 గర్భిణులు, 15 మంది డయాబెటిక్ రోగులు, చిన్న పాటి అనారోగ్య సమస్యలున్న నలుగురికి వైద్య సేవలందించారు.
- తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో శంకరం గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్ సమీన్ వైద్యసేవలందించారు. 69 ఓపీలు చూశారు. వీరిలో 40 బీపీ, షుగర్ రోగులు, ఐదుగురు రక్తహీనత, ఐదుగురు గర్భిణులు, సాధారణ రుగ్మతలున్న వారు 19 మంది ఉన్నారు.
- కశింకోట పీహెచ్‌సీ పరిధిలో గవరపేట హెల్త్ క్లినిక్‌లో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వై.యశోద పాల్గొన్నారు. సుమారు 103 మందికి ఓపీ సేవలందించారు. మధుమేహం, బీపీ, జ్వరం, దగ్గు, జలుబు, స్పర్శలేని మచ్చలున్న రోగులను పరీక్షించారు.

రక్తహీనత నుంచి ఉపశమనం



నా వయసు 17 ఏళ్లు. ఏ పని చేస్తున్నా చాలా త్వరగా అలసిపోయేదాన్ని. విలేజ్ హెల్త్ క్లినిక్ డాక్టర్‌కు నా సమస్యను చెప్పాను. రక్త పరీక్షలు చేశారు. నా వంట్లో రక్తం 7.6 శాతమే ఉందని తేలింది. వెంటనే తగరంపూడి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఐరన్ ట్యాబ్లెట్లతోపాటు, రక్తం ప్యాకెట్లను ఎక్కించారు. ప్రస్తుతం 11 శాతానికి రక్తం పెరిగింది. .

– పొడుగు జ్యోతిక, తగరంపూడి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మా ఊరికి ప్రభుత్వ డాక్టర్లు వచ్చి ఇంత గొప్ప వైద్యం అందిస్తారని ఎప్పుడూ ఊహించలేదు. ఊర్లో ఎవరికి ఏ రోగం వచ్చినా పీహెచ్‌సీకి వెళ్లాల్సిందే. అక్కడ కూడా గతంలో సరైన వైద్యం అందేది కాదు. ఏఎన్ఎంలే ఏవో ట్యాబ్లెట్లు ఇచ్చి పంపించేసేవారు. ఇపుడలా లేదు. కార్పొరేట్ వైద్యం ఊర్లోనే అందుతోంది. సీఎం జగన్‌కు నిజంగా రుణపడిపోయాం.

– వి.సోమేశ్వరరావు, మూలపేట

విద్యతో గౌరవం



ఉత్తమ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే గణబాబు

కంచరపాలెం: ఏ రంగంలో ఉన్నా.. విద్య అనేది ఉన్నత స్థాయి, గౌరవాన్ని ఇస్తుందని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతి అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాటిచెట్లపాలెం ఆశీర్వాద కల్యాణ మండపంలో ఉత్తమ విద్యార్థులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. సంఘ అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు ఎంపీ సత్యవతి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రతీ ఏటా గవర సామాజిక వర్గ విద్యార్థులను ఈ విధంగా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గణబాబు మాట్లాడుతూ ప్రపంచంతో పోటీ పడుతున్న నేటి సమాజంలో విద్యకు ప్రధాన ప్రాధాన్యత అవసరమన్నారు. బుద్ధ శివాజీ మాట్లాడుతూ తమ సామాజిక వర్గం విద్య ద్వారా అభివృద్ధి చెంది, ప్రతి విద్యార్థినీ ప్రోత్సహించాలని, ఏటా సుమారు 500 మంది పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, డాక్టర్ బుద్ధ మురళీసంతోష్, ఆడారి పూరి జగన్నాథం, కాళ్ల రాధిక, కొణతాల వీకే శ్రీనివాసరావు, వేగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మీనామృతం తయారీపై అవగాహన



మీనామృతంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కశింకోట: మండలంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో ఆదివారం మీనామృతం తయారీపై స్వయం సహాయక సంఘాల సభ్య రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ, సిబ్బంది డి.వి.లక్ష్మి, ఐసీఆర్‌పీ వి.శాంతి తదితరులు నూతలగుంటపాలెం, జి.భీమవరం, ఆనందపురం, అచ్చెర్ల, మోసయ్యపేట, చెరకాం గ్రామాల్లో చేపలు, బెల్లం మిశ్రమంతో మీనామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. దీన్ని సాగులో వినియోగించడం వల్ల అధిక దిగుబడిని సాధించవచ్చని తెలిపారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం



బీఎంఎస్ వ్యవస్థాపక వేడుకల్లో పాల్గొన్న యూనియన్ ప్రతినిధులు, కార్మికులు

పరవాడ: సింహాద్రి కాంట్రాక్టు కార్మిక సంఘ్(బీఎంఎస్) ఆధ్వర్యంలో భారతీయ మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు.యూనియన్ అధ్యక్షుడు బొట్టారమణ పతాకావిష్కరణ చేశారు. సంఘ కోశాధికారి లాలం ప్రసాద్ మాట్లాడుతూ సమాజ అవసరాలు తీర్చడానికి బలమైన కార్మిక శక్తిని నిర్మించడానికి భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, బురద తాతబాబు, జి.నాగభూషణరావు, కె.వాసు, బి.బాలాజీ, బి.మూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక న్యూకాలనీ రోటరీ మెమోరియల్ హాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గాల సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.రాకేష్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా కమిటీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు హాజరుకావాల్సిందిగా కోరారు.

బ్రాండిక్స్‌లో 412 మందికి ఉచిత కంటి పరీక్షలు



బ్రాండెక్స్‌లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్ అపారెల్ సిటీలో ఆదివారం 111వ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 412 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా 264 మందికి కళ్లద్దాలు అందజేశారు. 144 మందికి మందులు అందజేశారు. 34 మంది కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, మజ్జిగ, మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 12 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ బ్రాంచ్ చైర్మన్ శివ నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

పరదేశమ్మ మండపం నిర్మాణానికి భూమి పూజ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల అందలాపల్లి గ్రామంలో ఆదివారం పరదేశమ్మ వారి గుడి ముందు మండపం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, కోట్ని శివలు కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న గ్రంథాలయం



కశింకోటలో అందంగా ముస్తాబు అవుతున్న శాఖా గ్రంథాలయ భవనం

కశింకోట: కశింకోటలోని శాఖా గ్రంథాలయ భవనాన్ని రూ.5 లక్షలు వ్యయంతో అందంగా రూపొందిస్తున్నారు. భవనానికి రంగులు వేసి, ఒక వైపు ప్రహరీ గోడ నిర్మించారు. కిటికీలు, తలుపులకు మరమ్మతులు చేపట్టారు. ఇవి పూర్తయితే గ్రంథాలయానికి నూతన శోభ సంతరించుకోనుందని పాఠకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష నేడు

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలోని వంగలి, అంతకాపల్లి సచివాలయాల పరిధిలో సోమవారం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాల నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభల్లో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని దరఖాస్తుదారులకు పలు రకాల ధ్రువ పత్రాలు అందజేస్తారన్నారు. అదేవిధంగా ప్రజలు వలంటీర్ల ద్వారా తెలియజేసిన సమస్యలపై అధికారులతో చర్చిస్తారని తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా సచివాలయాల పరిధిలో నిర్వహించే కార్యక్రమాన్ని దరఖాస్తుదారులు, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

సబ్బవరం: మండలంలోని వంగలిలో శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పాడేరు నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ విరాళం మొత్తాన్ని గ్రామంలో నిర్మిస్తున్న ఆలయం వద్ద మండల వైస్ ఎంపీపీ, ఆయన సోదరుడు చొక్కాకుల గోవింద్ ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు గవర రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ పెద్దలు కోట్ని నాయుడు, వేపాడ స్వామినాయుడు,జెట్టి హేమంత్, కందా అప్పల స్వామి,జెట్టి స్వామినాయుడు, మేడపురెడ్డి జగన్నాథం, దేవుడుబాబు పాల్గొన్నారు.

చల్లంగా చూడమ్మా.. నూకాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన ఆదివారం కావడంతో దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల వాసులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలోని చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి, కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. గర్భిణులకు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు, ట్రాఫిక్ సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

17 నుంచి శ్రావణమాస ఉత్సవాలు



ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో ఆగస్టు 17 నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు కల్యాణగిరిపై ఆదివారం నిర్వహించిన సమావేశంలో శ్రావణమాస ఉత్సవాలు, ప్రత్యేక పూజలకు సంబంధించి ఆహ్వాన శుభపత్రికను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. అనంతరం శ్రావణమాసాన్ని పురస్కరించుకుని చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా వచ్చే నెల 17న శ్రావణ శుద్ధ పాడ్యమి గురువారం ఉదయం 7 గంటలకు కోటి కుంకుమార్చన జరపాలని నిర్ణయించారు. ఆగస్టు 18, 25, సెప్టెంబర్ 1, 8 తేదీల్లో శుక్రవారాల్లో కూడా కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. సెప్టెంబరు 13న కోటి కుంకుమార్చన ముగింపు సందర్భంగా లలితా సహస్రనామ హోమం, పూర్ణాహుతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. సమావేశంలో ధర్మకర్త బోయిన రమణాజీ, లక్కరాజు అప్పారావు, కోశాధికారి పోతల రమణ, ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి ధర్మాచార్యులు, కోరుకొండ సాంబశివరావు, సుకురు చంద్రం, కరణం నాయుడు, మళ్ల భోగలింగం, బాదపు రామలక్ష్మి, శ్రీదేవి, కుమారి, వెంకటరావు, దాస అప్పారావు పాల్గొన్నారు.

నిత్యం వ్యాయామంతో ఆరోగ్యం



లాంగ్ వాకింగ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న క్లబ్ చైర్మన్ పీఎస్ అప్పారావు

అనకాపల్లిటౌన్: నిత్య జీవితంలో మానసిక ఒత్తిడి తగ్గి ఆరోగ్యంగా జీవించాలంటే రోజూ వ్యాయామం చేయాలని అనకాపల్లి బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ పి.ఎస్.అప్పారావు అన్నారు. అంతర్జాతీయ స్నేహ మాసోత్సవంలో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రింగ్‌రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకూ లాంగ్ వాకింగ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఏడాది నుంచీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వాకింగ్‌లో పాల్గొనే క్లబ్ సభ్యులను రెండు విభాగాలుగా విభజించి, ప్రతి విభాగానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు, గౌరవాధ్యక్షుడు పెంటకోట నర్సింగరావు, కార్యదర్శి భర్నికాన శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి బుద్ద శివ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఏఎల్ కళాశాలలో ఉపాధి కోర్సులకు వినతి



జార్జిక్లబ్ ఆవరణలో ఏఎంఏఎల్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అనకాపల్లిటౌన్: మండలంలోని కొత్తూరు పంచాయతీ పరిధి ఏఎంఏఎల్ కళాశాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలున్న కొత్త కోర్సులను ప్రవేశపెట్టాలని యాజమాన్యాన్ని కోరనున్నట్లు జార్జిక్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, రాష్ట్ర విద్యార్థి జేఏసీ నాయకుడు ఆడారి కిషోర్‌కుమార్, మున్సిల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావులు తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంఘం ఆధ్వర్యంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతి నెల రెండో శనివారం విద్యార్థులంతా సమావేశం కావాలని కోరారు. దేశ, విదేశాల్లో వివిధ హోదాల్లో ఉన్న సుమారు లక్ష మంది పూర్వ విద్యార్థుల వివరాలు సేకరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో సోలార్ యూనిట్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీహెచ్ రామచంద్రరావు, కేవీఎస్ నాయుడు, పెనుమత్స కృష్ణంరాజు, వై.జగదీశ్వరరావు, కేఎస్ఎస్ శర్మ, కొణతాల రాజేంద్రప్రసాద్, బీవీ కన్నారావు, పెంటాద్రి రావు, బాలు గాడి, బీవీ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న కాండ్రేగుల వెంకటరమణ

అనకాపల్లిటౌన్: వినియోగదారుల హక్కులు, పౌర సరఫరాలు, వ్యవసాయశాఖల సమస్యల పరిష్కారానికి ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 1967ను సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ సూచించారు. గవరపాలెంలోని పబ్లిక్ ఫోరం కార్యాలయంలో ఆదివారం జరిగిన వినియోగదారుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, బియ్యం కార్డు, గ్యాస్, పెట్రోల్ బంకులు, రైతు బజార్లు, తూనికలు కొలతల శాఖ, ఔషధ నియంత్రణ, హాల్‌మార్కు, ఐఎస్‌ఐ మొదలగు వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ దిక్సూచిగా నిలుస్తుందన్నారు. వినియోగదారుల హక్కుల రక్షణ, చైతన్యం తీసుకురావడం ప్రధాన లక్ష్యాలుగా ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్ రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, వినియోగదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.రమణ, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు ఎస్.నూకరాజు, బి.జగ్గఅప్పారావు పాల్గొన్నారు.